క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తడ/దొరవారిసత్రం: తడ మండలం అక్కంపేట, దొరవారి సత్రం మండలం మావిళ్లపాడులోని ఆదర్శపాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు వచ్చే నెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు సౌజన్య, సీహెచ్ సుమలత వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వివరాల కోసం 70329 96508, 95020 97754, 94906 97556, 89190 66398 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అధ్యాపకులకు శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈసీఈ విభాగం, జేఎన్‌టీయూఏ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరుగనున్న ఈ శిక్షణకు తొలి రోజు తిరుపతి ఐఐటీ నుంచి ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణసాయి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, డీప్ లెర్నింగ్, మెషీన్ లెర్నింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఈసీఈ విభాగం హెచ్‌ఓడీ హరనాథ్‌రెడ్డి, కార్యక్రమం కోఆర్డినేటర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలకు పరిష్కారం



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దప్పు కళాకారులు

సైదాపురం: మండలంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా పలువురు వినతిపత్రాలు సమర్పించారు. దప్పు కళాకారులు పింఛన్ కోసం అధిక సంఖ్యలో అర్జీలు సమర్పించారని చెప్పారు. సర్వే సమస్యలు లేకుండా ఉండేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఉపాధి కూలీల నిరసన



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయి కార్మిక సంఘం నాయకులు

గూడూరురూరల్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసి, పేదవారి పొట్ట కొట్టాలని చూస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకానికి దశలవారీగా నిధులు తగ్గిస్తోందని ఆరోపించారు. పనులు లేక ప్రజలు వలసలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు జోగి శివకుమార్, బీవీ రమణయ్య, ప్రసాద్, ముత్యాలయ్య, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి: వేసవిలో ఆరుబయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి ఎస్‌ఐ ఎస్‌కే జిలానీబాషా సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుబయట నిద్రించే వారు విలువైన అభరణాలు ధరించకూడదని చెప్పారు. నాలుగు రోజులుగా వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో మహిళల మెడల్లోని ఆభరణాలు చోరీకి గురవుతున్నాయని చెప్పారు. అనుమానితులుఎవరైనా గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఏదైనా చోరీ జరిగితే, 94407 96349 నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు.

గ్రావెల్ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు నిలిపి వేసిన గ్రావెల్ లారీలు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు నుంచి గ్రావెల్ తరలిస్తున్న లారీలను సోమవారం గ్రామస్తులు అడ్డుకుని, నిలిపేశారు. శిరసనంబేడు, రాజుపాళెం, చెన్నప్పనాయుడుపేట బంగారంపేట, ఊడిపూడి గ్రామాల నుంచి జాతీయ రహదారి అభివృద్ధి పనులకు లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. భారీ లోడ్‌తో అతి వేగంగా గ్రావెల్ తరలిస్తూ ఓ లారీ సోమవారం అరుంధతీయ కాలనీలో ప్రహరీగోడను ఢీకొంది. దీంతో స్థానికులు ఆగ్రహంతో లారీ డ్రైవర్లతో వాగ్వివాదానికి దిగి వాహనాలను అడ్డుకుని నిలిపేశారు. ఈ విషయమై ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

హలాలు పట్టి..పొలాలన్నీ దున్ని..

కరుణించిన ప్రకృతి.. కళకళలాడుతున్న నీటి వనరులు.. అన్నదాతకు అండగా నిలిచిన సర్కారు.. వెరసి.. సాగుకు ఊతమొచ్చింది. అన్నదాతలు హలాలు పట్టి పొలాలన్నీ దున్ని.. ఎడగారులో పైరు పెడుతున్నారు. ఫలితంగా వాకాడు మండలంలో రికార్డు స్థాయిలో వరి సాగు నమోదైంది.

- ముమ్మరంగా ఎడగారు సాగు
- సాగులో అన్నదాతలు బిజీ.. బిజీ..
- ఏడాదిలో మూడు పంటలు



దుక్కి చేసి, చెక్క తోలుతున్న కర్షకుడు



దుక్కి దున్ని, నాట్లకు సిద్ధం చేసిన పొలాలు



వరి నాట్లు వేసే పనిలో బిజీ బిజీగా రైతులు

వాకాడు: మండలంలో మూడేళ్లుగా ఏడాదికి మూడు పంటలు పండుతున్నాయి. దీంతో రైతులు ఎడగారు సీజన్ సైతం పూర్తిస్థాయిలో వరి సాగు చేస్తున్నారు. మండలంలో 15 వేల ఎకరాలు పంట పొలాలున్నాయి. అందులో ఇప్పటి వరకు దాదాపు 9 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మరో 4 వేల ఎకరాలు దుక్కి సిద్ధం చేస్తున్నారు. దీంతో అన్నదాతలు ఎక్కడ చూసినా సాగు పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ముందుస్తుగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచింది. ఒకప్పుడు సాగు నీరు కొరతతో ఏడాదిలో ఒక పంటకే పరిమితమైన రైతులు మూడేళ్లుగా ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. రెండుసార్లు వరి, మధ్యలో చిరు ధాన్యం పంటలను సాగుచేస్తున్నారు. కాగా మండలంలోని చెరువులు, బ్యారేజ్, కాలువలు, వాగులు, వంకలు మండు వేసవిలోనూ జలకళను సంతరించుకుని ఉన్నాయి. దీంతో రైతులు దీమాగా మూడో పంటను పూర్తిస్థాయిలో సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, సబ్సిడీతో అందించడంతోపాటు సాగు ప్రారంభంలోనే రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాకాడు, కాశీపురం, గొల్లపాళెం, ముట్టెంబాక, నెల్లిపూడి, కల్లూరు, ముట్టెంబాక, కొండాపురం, రావిగుంటపాళెం తదితర గ్రామాల్లో రైతులు సాగులో నిమగ్నమయ్యారు.

మూడేళ్లుగా పుష్కలంగా నీరు



"మూడేళ్లుగా సాగునీరు పుష్కలంగా ఉంది. దీని కితోడు ప్రభుత్వం వ్య వసాయానికి రాయితీ లు ఇస్తోంది. రైతు భరో సా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో సీజన్‌తో పని లేకుండా ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నాం.

– కుంభాల మస్తానయ్య, రైతు, వాకాడు

పూర్తిస్థాయిలో ఎడగారు



మండు టెండల్లో సైతం వాగులు, వంకలు, చె రువులు, బ్యారేజ్ సాగు నీటితో కళ కళలాడుతున్నాయి. దీంతో ఎడగారు సాగు పూర్తిస్థా యి విస్తీర్ణంలో చేస్తున్నాం. అన్ని అనుకూలించడంతో తాము ఆనందంగా ఎడగారు సాగులో బిజీ బిజీగా ఉన్నాం.

– చేను జనార్దన్, రైతు గొల్లపాళెం

అధిక విస్తీర్ణంలో వరిసాగు



ప్రభుత్వం రైతులను అ న్ని విధాల ప్రోత్సహిస్తోంది. దీంతో కర్షకులు ఎడగారు సీజన్‌లో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాం. ఆర్బీకేల్లో 80 టన్నుల వరకు యూరియా అందుబాటులో ఉంది.

– దీప, వ్యవసాయాధికారి, వాకాడు

అధిక టన్నేజీతో ఖనిజాన్ని తరలిస్తే చర్యలు

సైదాపురం: అధిక టన్నేజీతో ఖనిజాన్ని తరలిస్తే చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ నాగబా బు హెచ్చరించారు. సోమవారం వాహనాల తనిఖీలు చేశారు. అధిక టన్నేజీలతో తలిస్తు న్న వాహనాలను సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అధిక టన్నేజీ కారణంగా రహదారులు ఛిద్రం కావడంతోపాటు పలు ప్రమాదాలు జ రుగుతున్నాయన్నారు. నిబంధనల మేరకు ఖ నిజాన్ని తరలించుకోవాలన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రవ్ కార్యక్రమంలో భాగంగా పలు వాహనాలను తనిఖీలు చేసి వారిపై కేసులను నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

బీమా బాండ్ల పంపిణీ



బాండ్లను అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెంలో సోమవారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పురోహితులకు వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొండవలూరు దామోదర్‌రెడ్డి బీ మా బాండ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొడవలూరు రాధాకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఒక ఏడాదికి పోస్టల్ ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లించి, వాకాడు, కోట, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి, గూడూరు, నాయుడుపేట మండలాలకు చెందిన 60 మంది అర్చకులు, పురోహితులకు బాండ్లు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాపూరు సచివాలయం పరిధిలోని మసీదుపేట, ఇందిరాకాలనీ, మద్దెలమడుగులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌లు అందజేశారు. అంతకు ముందు వారికి వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నేదురుమల్లి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తమను ప్రజల వద్దకు పంపారని తెలిపారు. సీఎం జగనన్న ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రజల వద్దకే అధికారులను పంపుతున్నారని తెలిపారు. సమస్యలుంటే తమ పరిధిలోనివి స్థానిక అధికారులకు చెప్పి, పరిష్కరిస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయి సమస్యలుంటే వెంటనే సంబంధిత జిల్లా అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే నేరుగా సీఎం జగన్ మోహన్ రెడ్డికే తెలిపేందుకు 1902 నంబర్‌కు డయల్ చేసి చెప్పాలన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించే శక్తి ఒక జగన్‌మో హన్‌రెడ్డికే ఉందని, ప్రజలంతా ఆయన్ని ఆశీర్వదించాలనికోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శశిధర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, రాపూరు సర్పంచ్ జయమ్మ, సిద్ధవరం ఎంపీటీసీ సభ్యుడు పెంచలరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కలపాటి మధుసూదన్‌రెడ్డి, అబ్దులా, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజా ప్రతినిధులకు గడప గడపలో అపూర్వ ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. అండగుండాల పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్లు అందజేశారు. గ్రామంలో శ్మశానానికి దారి, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని, ఎంపీపీ గ్రాంటు నుంచి నిధులు విడుదల చేసి ప్రహరీ నిర్మాణం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు మాధురి, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, నాయకులు కే చంద్రశేఖర్‌రెడ్డి, నత్తం శ్రీనివాసులు, ఎంఎం శ్రీనివాసులు, టీ రవిరెడ్డి పాల్గొన్నారు.

అగ్రవర్ణాల పేదలకు న్యాయమే సీఎం లక్ష్యం



దశరథరామిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుతో అగ్రవర్ణాల పేదలకు న్యాయం జరగాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి అధ్యక్షతన సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు దశరథరామిరెడ్డికి అభినందన సభ జరిగింది. ఈ సభలో ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇద్దరి కి రెడ్డి కార్పొరేషన్‌లో ప్రాధాన్యత కల్పించారన్నా రు. పదవులు వచ్చాయంటే బాధ్యతలు పెరగడమే నని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడాలని పి లుపునిచ్చారు. అన్ని వర్గాల పేదలతో పాటు అగ్రవర్ణ పేదలు కూడా ఉన్నత స్థితికి రావాలనే కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, షేక్ రఫీ, వెంకటకృష్ణారెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, వాణి శంకర్‌రెడ్డి, ఓ కిషోర్‌యాదవ్, చదలవాడ కుమార్, అత్తివరం గో పాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, దార రవి, చంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

దక్కిలి: జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను కోరారు. ఇప్పటివరకు మంజూరైన 700 పక్కా గృహాలను త్వరతగతిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచా యతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ముందుస్తుగా గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఓటీఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. వైద్యాధికారి బిందు ప్రియాంక మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీలో కుక్క కాటుకి మందు అందుబాటులో ఉందన్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండో విడత నాడు–నేడు కింద 21 పాఠశాలలును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారి మాట్లాడుతూ దక్కిలిలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఉపయోగంలోకి తీసుకొచ్చి గదులు ఏర్పాటు చేసి, అద్దెకు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంబులూరు, మాధవయ్యపాళెం గ్రామాల మీదుగా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని మాధవయ్యపాళెం సొసైటీ అధ్యక్షుడు వేణు నాయుడు కోరారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, మండల ప్రత్యేకాధికారి మునిరామ్, హౌసింగ్‌డీ ఈఈ ఎండీ జహీర్ హుద్దీన్ అహ్మద్, తహసీల్దార్ రమేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ నాగరాజు, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ బాబు, ఏఓ విజయభారతి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వెంకటగిరి: ఎండలు మండుతున్న నేపథ్యంలో స్థానికులు వడదెబ్బకు గురుకాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వెంకటగిరి ఫ్రెండ్స్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె రవీంద్రబాబు తెలిపారు. ఆ సొసైటీ ఆధ్వర్యంలో పోలేరమ్మ ఆలయం ఆర్చి సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద సోమవారం దాత దశరథనాయుడు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి నన్నారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ సభ్యులు ఏ రమేష్ బాబు, నందకిషోర్, ప్రతాప్, కేవీ చెంచుకృష్ణ, వి శ్రీనివాసరావు, చెంచుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తొట్టంబేడు (రేణిగుంట): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని డీఎస్పీ భీమారావు అన్నారు. ఇటీవల సీఎం కప్ క్రీడా పోటీలలో ఆర్బీటీఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు టేబుల్ టెన్నిస్, టెన్నిస్ పోటీలలో రెండవ స్థానం సాధించారు.అలాగే కళ్యాణ దుర్గం, అనంతపురం జిల్లాలో జరిగినటు రాష్ట్రస్థాయి జూడో అండర్–19 విభాగం ఈ స్కూల్ కు చెందిన జాన్సీ, వైష్ణవి సిల్వర్ రజత, లలిత కాంస్య పతకాలను సాధించారు. వీరిని డీఎస్పీ అభినందిస్తూ సోమవారం సత్కరించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ చదువుల కాలంలో విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు.

పోలీసుల తీరు మారకపోతే చర్యలు తప్పవు



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ

గూడూరు: ప్రజలతో పోలీసుల ప్రవర్తన మారాలని, తీరు మారకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హెచ్చరించారు. గూడూరులో ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఒక వాహనానికి సంబంధించిన వారు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని తెలియజేశారు. దీంతో ఎమ్మెల్సీ ఒకటో పట్టణ ఎస్‌ఐ పవన్ కుమార్‌కు ఫోన్ చేసి వాహనాన్ని ఉంచుకుని, వారిని పంపి వేయాలని కోరారు. ఇందుకు ఎస్‌ఐ అలాగే అని చెప్పడంతో కొంతసేపటి తరువాత బాధితులు ఎస్‌ఐ వద్దకు వెళ్లారు. వారిని చూడగానే ఆగ్రహించిన ఎస్‌ఐ వారితోపాటు ఎమ్మెల్సీని దుర్భాషలాడారు. ఈ విషయాన్ని వారు ఎమ్మెల్సీకి తెలియజేశారు. దీంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఉదయం నిరసన కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్సీ నివాసానికి చేరుకుని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయకులతో చర్చించారు. ఎస్‌ఐను సెలవుపై పంపిస్తున్నామని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో నేతలు నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మగ్దూం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృత్య నీరాజనంలో గూడూరు చిన్నారుల ప్రతిభ



అవార్డులు అందుకున్న గూడూరు చిన్నారులు

గూడూరు: హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభలో జరిగిన నృత్య నీరాజనం–2023లో గూడూరు శ్రీశివ లలిత భరత నాట్య కళా క్షేత్రానికి చెందిన విద్యార్థులు సంప్రదాయ నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచారు. నృత్య నీరాజనంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు సుహర్శిని, ప్రజ్ఞ, షమిత, జాశిత, నిక్షిత, శ్రీవిద్యా, భవిష్య, శ్రీధార, లోక్యా, మిథున్, ఐశ్వర్య, గగన, మన్విత, భవజ్ఞాలకు గాయని శోభారాజ్, కూచిపూడి నాట్యాచార్యులు వేదాంతం రాధేశ్యామ్ చేతుల మీదుగా శ్రీవెంకటేశ్వర, నటరాజ, నాట్య దీపిక అవార్డులు అందజేశారు.

● సెలవు.. సరదాకు నెలవు

వేసవి సెలవులతో పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు వచ్చిన చిన్నారులు ఆట పాటలతో సరదాగా గడుపుతున్నారు. చెట్ల కింద ఆటలు ఆడుతూ సందడి చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా.. ఏ వీధిలోకి వెళ్లిన చిన్నపిల్లలు ఆటల్లో మునిగి తేలుతున్నారు. కొన్ని గ్రామాల్లో సంతోషంగా పంట పొలాల్లో క్రికెట్ ఆడుతూ సెలవు రోజులు సరదాగా గడుపుతున్నారు. – దొరవారిసత్రం







ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా



అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

చిల్లకూరు: మోమిడి రెవెన్యూ పరిధిలోని రిజర్వు ఫారెస్టు భూమిలో సిలికా తవ్వకాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం అధికారులు సిలికా తవ్వకాలపై అద్దెపల్లి వద్ద ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లారు. అయితే ఈ కార్యక్రమాన్ని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు ఈ విషయాన్ని ఆర్డీఓ, తదితర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనల మేరకు ప్రజాభిప్రాయ సేకరణను మోమిడి గ్రామంలో ఏర్పాటు చేస్తామని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.